# 65

# యూదుల తీర్పులు మరియు పేతురు బొంకుట

## (26:57-75)

ఆయన ఒలీవల కొండపై పట్టబడిన తరువాత, యేసు కయప యొద్దకు, ప్రధాన యాజకుడై యుండినవాని యొద్దకు కొనిపోబడెను, ఆ తరువాత సన్హెడ్రిన్ మహా సభ యెదుటకి, ఆయనకు తీర్పు తీర్చబడిన చోటికి కొనిపోబడెను (26:57-68). పేతురు యేసును దూరము నుండి వెంబడించుచుండెను, తీర్పుల పరిణామమేమై యుండునో తెలిసికొనవలెనని ఆశించుచుండెను. అతడు యేసుతో కూడ ఉండినవాడని గుర్తుపట్టబడిన తరువాత, యేసును ఎరుగనని పేతురు ముమ్మారు బొంకాడు (26:69-75).

### యూదుల తీర్పులు (26:57-68)

**[57]యేసును పట్టుకొనినవారు ప్రధానయాజకుడైన కయప యొద్దకు ఆయనను తీసికొనిపోగా, అక్కడ శాస్త్రులును పెద్దలును కూడియుండిరి. [58]పేతురు ప్రధానయాజకుని యింటిముంగిటివరకు, ఆయనను దూరమునుండి వెంబడించి లోపలికి పోయి-దీని అంత మేమవునో చూడవలెనని బంట్రౌతులతోకూడ కూర్చుండెను. [59]ప్రధానయాజకులును, మహా సభవారందరును, యేసును చంపవలెనని ఆయనకు విరోధముగా అబద్ధసాక్ష్యము వెదకుచుండిరి కాని [60]అబద్ధసాక్షులనేకులు వచ్చినను సాక్ష్యమేమియు దొరకలేదు. తుదకు ఇద్దరు మనుష్యులు వచ్చి [61]-వీడు దేవాలయమును పడగొట్టి, మూడు దినములలో దానిని కట్ట గలనని చెప్పెననిరి. [62]ప్రధానయాజకుడు లేచి-నీవు ఉత్తర మేమియు చెప్పవా? వీరు నీమీద పలుకుచున్న సాక్ష్య మేమని అడుగగా యేసు ఊరకుండెను. [63]అందుకు ప్రధాన యాజకుడు ఆయనను చూచి-నీవు దేవుని కుమారుడవైన క్రీస్తువైతే ఆ మాట మాతో చెప్పుమని జీవముగల దేవునితోడని నీకు ఆనబెట్టుచున్నాననెను. అందుకు యేసు- నీవన్నట్టే. [64]ఇది మొదలుకొని మనుష్యకుమారుడు సర్వ శక్తుని కుడిపార్శ్వమున కూర్చుండుటయు, ఆకాశ మేఘారూఢుడై వచ్చుటయు మీరు చూతురని చెప్పగా [65]ప్రధానయాజకుడు తన వస్త్రము చింపుకొని-వీడు దేవ దూషణ చేసెను; మనకిక సాక్ష్యులతో పని ఏమి? ఇదిగో ఈ దూషణ మీరిప్పుడు విన్నారు; [66]మీకేమి తోచుచున్నదని అడిగెను. అందుకు వారు-వీడు మరణమునకు పాత్రుడనిరి. [67]అప్పుడు వారు ఆయన ముఖముమీద ఉమ్మివేసి, ఆయనను గుద్దిరి; [68]కొందరు ఆయనను అర చేతులతో కొట్టి-క్రీస్తూ, నిన్ను కొట్టినవాడెవడో ప్రవచింపు మనిరి.**

**వచనము 57.** యోహాను 18:12-24 ప్రకారము, యేసు మొదట అన్న యొద్దకు, మాజీ ప్రధాన యాజకుని యొద్దకు తీసికొనిపోబడెను.[1] అన్న ప్రజలపై చూపిన ప్రభావమునుబట్టి ప్రజల్లో ఏర్పడిన మర్యాద ఆధారంగా యేసును అతని యొద్దకు కొనిపోయారు. రోమా

ప్రభుత్వ ప్రధాన ప్రతినిధిగా వ్యవహరించుచుండిన వెలెరియస్ గ్రేటస్ చేత క్రీ.శ. 15లో అతడు పదవి నుండి తొలగింపబడినప్పటికిని, యూదులలో అనేకులు యింకను అతనిని ప్రధాన యాజకుడుగానే పరిగణించుచుండిరి (26:3పై గల వ్యాఖ్యానము చూడు). అన్న యేసు ప్రభువును తన శిష్యులు మరియు బోధల గూర్చిన ప్రశ్నలడుగుచు పరీక్షించి, ఆ మీదట అతని అల్లుడు, కయప యొద్దకు పంపించాడు.[2]

ఈ వివరాలన్నింటిని మత్తయి చేర్చలేదు; కానీ **యేసును పట్టుకొనినవారు ప్రధాన యాజకుడైన కయప యొద్దకు, ఆయనను తీసికొనిపోగా, అక్కడ శాస్త్రులును పెద్దలును కూడియుండిరని** నివేదించాడు. యేసు పట్టబడుట తప్పనిసరిగా సంభవించనై యుండినదని ఎరిగి, సన్హెడ్రిన్ మహా సభ సభ్యులలో కొందరు కయప ఇంటి యొద్ద కూడుకొని యుండిరి. కయప యేసును పరీక్షించి, సన్హెడ్రిన్ మహా సభ సంపూర్తిగా సమావేశమైనప్పుడు వారికి ఏమని నివేదించాలో అదంతా తన మనస్సులో తీర్మానించుకొన్నాడనుటకు ఎటువంటి సందేహమైనను లేదు. కయప యేసును ప్రశ్నించిన మీదట, ఆయనను సన్హెడ్రిన్ మహా సభ యెదుట నిలువబెట్టించాడు.

మిశ్నా ప్రకారము, అబద్ధ ప్రవక్త యని ఎంచబడిన వానికి తీర్పు తీర్చునప్పుడు, సన్హెడ్రిన్ సభలోని సభ్యులందరును హాజరు కావలసి యుండినది.[3] ఏది ఏమైనా, ఈ సందర్భములో ఆ నియమము పాటించబడలేదు. అరిమతయియ యోసేపు సన్హెడ్రిన్ మహా సభ సభ్యుడై యుండెను (మార్కు 15:43; లూకా 23:50). నీకొదేము కూడ ఈ సభా సభ్యుడై యుండుట సాధ్యమే (యోహాను 3:1; 7:50, 51; 19:38, 39). ఆనాటి రాత్రి ఈ ఇరువురిలో అచ్చోట ఏ ఒక్కరైనను లేకుండిరి (లూకా 23:51, 52 చూడు).

మరుసటి రోజు ఉదయం తుది తీర్పు నిమిత్తమై యేసును ఈ మహా సభ యెదుటికి తీసికొని వచ్చారు (27:1; మార్కు 15:1; లూకా 22:66). ఈ మహా సభలో 71 మంది సభ్యులుండిరి: 70 మంది నియమితమైన సభ్యులు మరియు ప్రధాన యాజకుడు, సమావేశమునకు ఈయన అధ్యక్షత వహించు ముఖ్య న్యాయాధిపతియై యుండెను. ఈ సంఖ్య, అతనికి సహాయము చేయునిమిత్తము డెబ్బది మంది న్యాయాధిపతులను అతడు నియమించవలెనని దేవుడు మోషేతో సెలవిచ్చిన ఆజ్ఞపై ఆధారపడి యున్నది (సంఖ్యాకాండము 11:16).[4] ప్రతి ఒక్క సభ్యుడు ఇతర సభ్యులైన ప్రతి ఒక్కరిని చూచుటకు వీలుగా ఉండునట్లు వారు అర్ధ వలయాకారములో కూర్చొని యుందురు. ఇద్దరు లేఖకులు సభ్యుల వైపు ముఖముపెట్టి వారికెదురుగా కూర్చుందురు; ఒక లేఖకుడు నేరము మోపబడిన ముద్దాయి నిర్దోషి యని తీర్పుచెప్పు వాదోపవాదములను రికార్డు చేయగా, రెండవ లేఖకుడు నేరము మోపబడిన ముద్దాయి దోషి యని తీర్పుచెప్పు వాదోపవాదములను రికార్డు చేయును. ప్రతి సభ్యుడు వ్యక్తిగతముగా తీర్పు యిచ్చుచుండిరి.[5]

ఈ యూదులు, సాధారణంగా వారి నియమనిబంధనలను సూక్ష్మాతిసూక్ష్మంగా పాటించుచుండినవారు, ఈ సమయంలో యేసు దోషి యని తీర్పు చెప్పుటకు వాటిని బొత్తిగా పట్టించుకొనలేదు. (1) యేసును రాత్రివేళ పట్టుకొని తెల్లవారక మునుపే ప్రధాన యాజకుని యొద్దకు తీసికొనివచ్చుట ద్వారా వారు ఆ యా ప్రక్రియలను నిర్లక్ష్యము చేసారు.[6] (2) చట్టపరమైన వ్యవహారములు దేవాలయ ప్రాంగణములోనే పరిమితమైయున్న సన్హెడ్రిన్ మహా సభ సమావేశమగుచుండిన విశాలమైన గదిలోనే (Hall of Hewn Stone)

ముగింపబడవలసి యుండెను[7] – ఖచ్చితంగా ప్రధాన యాజకుని ఇంటి యొద్ద కాదు. (3) మరణ దండనకు సంబంధించిన వ్యాజ్యెములు సబ్బాతు దినాన సాయంకాలము లేదా ఒక పండుగ దినాన తీర్పు తీర్చబడకూడదు.[8] (4) సాక్షులు తెలియజెప్పు సాక్ష్యములు సమ్మతమైనవిగా ఉన్నవో లేవో చూచుకొనగలుగునట్లు వారిని వేరు వేరుగా ప్రశ్నించు పద్ధతిని వారు నిర్లక్ష్యము చేసారు.[9] (5) మామూలుగానైతే, మరణ దండన విధింపబడినప్పుడు, అధికారపూర్వకంగా ఆ విషయము ఘోషింపబడక మునుపు ఒక రాత్రి గడిచిపోవలెను.[10]

**వచనము 58. పేతురు ఆయనను** [యేసును] **దూరము నుండి వెంబడించాడు,** కానీ **ప్రధాన యాజకుని ఇంటి ముంగిట**[11] ఆగిపోయాడు. గెత్సేమనే తోటలో సంభవించిన సంఘటనలను గమనించిన పేతురు ఎంతగా గాభారాపడిపోయాడో! "శిష్యులందరు ఆయనను విడిచి పారిపోయిరని" 26:56 చెప్పుచున్నందు వలన, పేతురు కూడ పారిపోయి యుండునని మనము భావించుదుము. అట్లయినప్పటికిని, ఎందుకైనా మంచిదే అని కొంచెము ఎడముగానే, అతనిని ఎవరు గుర్తుపట్టకుండునట్లు తగు జాగ్రత్త వహించుచు, జనసమూహము వెంబడి వెళ్లుటకు అతడు తిరిగి వెనుకకు వచ్చాడు.

పేతురు ప్రధాన యాజకుని ఇంటి ముంగిట ఉన్నప్పుడు, యేసుకు **తీర్చబడుచుండిన తీర్పుల అంతమేమవునో చూడవలెనని** చలికాచుకొనుచు **బంట్రౌతులతో కూడ కూర్చున్నాడు** (యోహాను 18:18). "అధికారులు" అను మాటకు బదులుగా, ఇతర బైబిల్ అనువాదములలో "కావలివారు" (NIV; NRSV) లేక "పరిచారకులు" (NEB; NJB) అను మాట వ్రాయబడియున్నది. *Hupēretēs* అను గ్రీకు పదము సాధారణంగా మరొకరి అధికారము క్రింద ఉంటూ, అతనికి సహాయము చేయువానిని సూచించును.

ఊరేగింపుగా వెళ్లుచుండిన జనసమూహము వెంబడి వెళ్లిన మరొక శిష్యుడు, యోహానే అయియుండునని నమ్మినవాడు, ఆ ప్రాంగణము లోపలికి మొదట ప్రవేశించాడు. ప్రవేశ అనుమతి కోసం అతడు ద్వారపాలకునితో మాటలాడాడు, గనుక పేతురు కూడ లోనికి అనుమతింపబడినవాడు (యోహాను 18:15, 16). ఈ సంఘటనలన్నింటికి పేతురు మరియు యోహాను సాక్షులై యుండినందు వలన, మత్తయి మరియు ఇతర శిష్యులతో వారు ఇట్టి సమాచారమును పంచుకొని యుందురు.

**వచనము 59.** ఆయన మీద మోపబడిన నేరములలో యేసు ఏ నేరము విషయములోనైనను దోషియని తేలలేదు, గనుక **ఆయనకు విరోధముగా అబద్ధసాక్ష్యము** చెప్పగల అవినీతిపరులను **ప్రధాన యాజకులు** మరియు సన్హెడ్రిన్ మహా సభ్యులు కనుగొనవలసిన అవసరం ఏర్పడింది. మరణ దండన విధించుటకు వారికి ఎటువంటి హక్కైనను లేకుండినందు వలన (1:19; 10:18; 12:14పై గల వ్యాఖ్యానములను చూడు),[12] యేసు **మరణ దండనకు** అర్హుడే యని రోమా ప్రభుత్వ అధికార ప్రతినిధిని ఒప్పించుటకు వారిప్పుడు ఏదో ఒక నేరము (నెపము) ఖచ్చితంగా కనుగొనవలసి యుండినది. **సభవారందరు** అను మాట ఇచ్చట మరీ అక్షరార్థముగా తీసికొనబడకూడదు. బహుశా, ఆనాటి రాత్రి సమావేశమైన వారందరిలో, ప్రతి ఒక్కరును ప్రభువైన యేసునకు విరోధముగా నుండినవారే అని మత్తయి చెప్పుచుండి యుండవచ్చును.[13]

**వచనములు 60, 61.** మొదట, యేసుకు **విరోధముగా సాక్ష్యమిచ్చుటకు అనేక మంది అబద్ధ సాక్షులు** ముందుకు వచ్చారు, కానీ వారి సాక్ష్యములు ఏకీభవించలేదు

(మార్కు 14:55, 56). ధర్మశాస్త్రము ప్రకారము, పొంతనగల ఇద్దరు లేక ముగ్గురు సాక్షుల సాక్ష్యములు లేకుండా ఒకనికి మరణ దండన విధింపబడకూడదు (సంఖ్యాకాండము 35:30; ద్వితీయోపదేశకాండము 17:6; 19:15). కొంతసేపైన తరువాత, **ఇద్దరు** సాక్షులు ముందుకు వచ్చి, **–వీడు దేవాలయమును పడగొట్టి, మూడు దినములలో దానిని కట్టగలనని చెప్పెనని పలికారు** (27:40 చూడు). అట్లయినప్పటికిని, వీరి కట్టుకథలు సహితము పొంతనలేనివై యుండినవి (మార్కు 14:59).

దేవాలయమునకు విరోధముగా మాటలాడుట యూదుల చేత తీవ్రమైన నేరముగా పరిగణింపబడినది (అపొస్తలుల కార్యములు 6:12–14). దేవాలయ పతనము గూర్చి యేసు ఏకాంతముగా ముందుగానే తెలియజెప్పినప్పటికిని (24:1, 2), ఆయన దానిని మూడు దినములలోగా తిరిగి కట్టునని ఎన్నడు చెప్పలేదు. అయితే, యూదులు "ఈ దేవాలయమును" నాశనము చేయుదురనియు, ఆయన దానిని మూడు దినములలో లేపుననియు ఆయన చెప్పినది నిజమే (యోహాను 2:19). ఏది ఏమైనా, దేవాలయము అని ఆయన ప్రస్తావించినది యెరూషలేము దేవాలయము కాదు కానీ ఆయన దేహమే; ఆయన తన మరణము మరియు పునఃరుత్థానమును పరోక్షంగా ప్రస్తావించుచుండెను (యోహాను 2:21, 22).

**వచనములు 62, 63. ప్రధాన యాజకుడు లేచి** ఆయన తన సొంత ప్రతిరక్షణగా ఏమైనా చెప్పుకొనవలసి యుంటే **చెప్పవచ్చునని యేసుతో** చెప్పినప్పుడు, ఆయన మొదట **ఊరకుండెను**. ఇది యెషయా 53:7లో వ్రాయబడి యున్న మాటల నెరవేర్పై యుండెను:

> అతడు దౌర్జన్యము నొందెను, బాధింపబడినను అతడు నోరు తెరవలేదు; వధకు తేబడు గొఱ్ఱెపిల్లయు, బొచ్చు కత్తిరించువాని యెదుట గొఱ్ఱెయు మౌనముగా నుండునట్లు, అతడు నోరు తెరువలేదు.

ఇటువంటి మాటలే కీర్తనలు 38:12–14లో కనబడును.

యేసు మౌనము సన్హెడ్రిన్ మహా సభపై గొప్ప ప్రభావము చూపినదని స్పష్టమగుచున్నది. సాధారణంగా, నేరము మోపబడినవాడు వానిపై మోపబడు ప్రతి నిందకు ప్రత్యుత్తరమిచ్చుటకు ప్రయత్నించుచు, వాడు నిర్దోషి యని నిరూపించుటకే ప్రయత్నించును, కానీ ఇప్పుడు యేసు ఏమియు మాటలాడలేదు.[14] ఆయన సిలువపై మరణించుటకే బద్ధుడై యుండెను, గనుక ఆయన తన ప్రతిరక్షణగా చెప్పుకొనవలసిన అవసరం లేకుండినది.

యేసు మౌనముగా ఉండినందువలన దానికి ప్రతిస్పందిస్తూ, **నీవు దేవుని కుమారుడవైన క్రీస్తువైతే, ఆ మాట మాతో చెప్పుమని, జీవముగల దేవుని తోడని నీకు ఆనబెట్టుచున్నానని** ప్రధాన యాజకుడు ఆయనతో చెప్పాడు. ధర్మశాస్త్రము ప్రకారము, సాక్షి నోరు తెరచి మాటలాడునట్లు వానిని బలవంతము చేయుటకు న్యాయాధిపతికి హక్కుండినది (లేవీయకాండము 5:1).[15] "ఆనబెట్టుట" (*exorkizō*) అని అర్థమిచ్చు గ్రీకు పదము, "ఒకడు ఒట్టుపెట్టుకొనునట్లు చేయుట" లేక "శపథము చేయుచు నేరము మోపుట" అని అర్థమిచ్చును. "జీవముగల దేవుని యెదుట నీవు శపథము చేయవలసి యుండునని" అర్థమిచ్చు మాటలు NRSV బైబిల్ అనువాదములో వ్రాయబడి యున్నవి.

ఏ విధంగా యేసుకు మరణ దండన విధింపవచ్చునో యని అందుకు తగిన ఆధారములను

స్థాపించుటకు కయప సకల ప్రయత్నములు చేయుచుండెను. యేసు, యూదుల రాజైన "క్రీస్తైయున్నాడని" స్వాధికారంతో చెప్పినట్లయితే, అది రోమా ప్రభుత్వమునకు వ్యతిరేకమైన దేశద్రోహము/రాజద్రోహముగా పరిగణింపబడును (అపొస్తలుల కార్యములు 17:7పై గల వ్యాఖ్యానము చూడు). ఆయన "దేవుని కుమారుడు" అని స్వాధికారముతో చెప్పినట్లయితే, అది యూదుల చేత దేవదూషణగా పరిగణింపబడును.

పాత నిబంధనలో, ఇశ్రాయేలీయులకు రాజుగా నున్నవాడు "దేవుని దత్తపుత్రుడు"గా దృష్టింపబడినాడు (కీర్తనలు 2:12). అతడు రాజుగా పట్టాభిషేకము చేయబడి అతనికి రాజ మకుటము ధరింపజేయబడినప్పుడు, అతడు ఇహమందు పరలోక దేవుని ప్రతినిధియని పరిగణింపబడినాడు. గనుక ఇది యేసుకు, రాజులకు రాజు, ప్రభువులకు ప్రభువైనవానికి అన్వయింపజేయబడుచు ప్రయోగింపబడినప్పుడు, "దేవుని కుమారుడు" అను పదజాలము ఆయన దైవత్వమును ధ్వనించును (3:17; 4:3, 6; 8:29; 14:33; 16:16; 27:40, 43, 54).

**వచనము 64.** ప్రధాన యాజకుడడిగిన ప్రశ్నకు యేసు ప్రత్యుత్తరమీయనట్లయితే, ఆయన క్రీస్తుకాడని, దాని గూర్చి ప్రత్యేకించి చెప్పకపోయినా అదొక గ్రహించదగ్గ అంగీకారమను అర్థము చెప్పబడును. ఏది ఏమైనా, ఆయన సత్యసంధత్వముతో సమాధానము చెప్పినప్పుడు, ఆయన మాటలు ఆయనకే విరోధముగా ప్రయోగింపబడునని యేసు ఎరిగియుండెను.

**నీవన్నట్టే** అని చెప్పుచు **యేసు** ప్రధాన యాజకునికి ప్రత్యుత్తరమిచ్చాడు. ఇది పరోక్షంగా "ఔను" అని సమాధానం చెప్పడమే ఔతుంది, మరియు ఆయనను ప్రశ్నించుచుండిన ప్రధాన యాజకునిపైనే ఒత్తిడి కలుగజేయుచుండినది. ఇదే అధ్యాయంలో ఇంతకు మునుపు, యేసు ఇస్కరియోతు యూదాకు కూడా ఇదే విధముగా సమాధానమిచ్చాడు (26:25).

ఆ తరువాత ఆయన సెలవిచ్చిన మాటల్లో గల అర్థమును సుస్పష్టంగావించుటకు, **ఇది మొదలుకొని మనుష్యకుమారుడు సర్వశక్తుని కుడి పార్శ్వమున కూర్చుండుటయు ఆకాశ మేఘారూఢుడై వచ్చుటయు మీరు చూతురు** అని చెప్పాడు.[16] ప్రజలు ఆశించుచుండినట్లు రణప్రియుడైన మెస్సీయగా గుర్తించుకొనుటకు బదులుగా, సమస్త జనులకు ప్రభువుగాను న్యాయాధిపతిగాను యేసు తనను తాను చిత్రీకరించుకొన్నాడు. అది ఆయన ప్రస్తుతమున్న పరిస్థితికి అనుగుణముగా ఉండినట్లు అగుపించకపోయినప్పటికిని, ఆయన ఈ సత్యమును బహు ధైర్యముతో బహిరంగపర్చాడు.[17]

యేసు వారి యెదుట ఉంచిన వర్ణన దానియేలు 7:13, 14 మరియు కీర్తనలు 110:1ని జోడించుచున్నది. దానియేలు 7వ అధ్యాయంలో, నాశనము చేయబడజాలని రాజ్యమును స్వీకరించునట్లు, మనుష్యకుమారుడు ఆకాశ మేఘారూఢుడై, మహా వృద్ధుని (తండ్రియైన దేవుని) సమీపించుచుండెను (24:30 చూడు). కీర్తనలు 110లో, అదొక మెస్సీయా సంబంధిత కీర్తన, ప్రభువు, సమస్త జనులను పరిపాలించుచు దేవుని కుడిపార్శ్వమున సింహాసనాసీనుడై యున్నాడు (22:42–45 చూడు). ఇచ్చట "సర్వశక్తుని" అను పదమును యేసు "ఎవరి పేరునైతే యూదులు క్రీ.పూ. రెండవ శతాబ్దము తరువాత తమ నోటితో ఉచ్చరించుటకు సంకోచించారో ఆ దేవుని గూర్చి కొద్ది మాటల్లో చెప్పదగిన దానిని విస్తరించి చెప్పుచున్నట్లుగా ప్రయోగించాడు."[18]

**వచనములు 65, 66.** యేసు, నిజానికి, తన శత్రువులకు సత్యమును తెలియజెప్పుట ద్వారా తనకు తానే దోషారోపణ చేసికొన్నాడు. యేసు ఇచ్చిన సాక్ష్యమునకు ప్రతిస్పందనగా, **ప్రధాన యాజకుడు తన వస్త్రము చింపుకొని, వీడు దేవదూషణ చేసెనని** చెప్పాడు. సాధారణంగా, ప్రధాన యాజకుడు తన వస్త్రములను చింపుకొనకూడదని దేవుడు తన ఆదేశములనిచ్చాడు (లేవీయకాండము 10:6; 21:10). అట్లయినప్పటికిని, యూదుల సాంప్రదాయము ప్రకారము, వారి యెదుటనే ఎవరైన దేవదూషణ చేసినప్పుడు న్యాయాధిపతులు తమ వస్త్రములను చింపుకొనవలసినవారై యుండిరి.[19]

యేసుకు విరోధముగా యింకా ఎక్కువ మంది **సాక్షులను** తీసికొనిరావలసిన **అవసరం లేదని** కయప చెప్పాడు. ఆయన దేవుని కుమారుడై యున్నాడని అంగీకరించుట ద్వారా యేసు **దేవదూషణ** చేసాడని కయప ప్రకటించాడు. ఆ తరువాత వారందరి అభిప్రాయమేమిటో యని మిగిలిన సన్హెడ్రిన్ మహా సభ సభ్యులను అడిగినప్పుడు, **వీడు మరణమునకు పాత్రుడని వారు ప్రత్యుత్తరమిచ్చారు**. మరణ దండన, ఆయన నామమునకు విరోధముగా దూషణ మాటలు పలికిన వారికి విధింపబడవలెనని దేవుడు శాసించిన శిక్షయై యుండినది (లేవీయకాండము 24:10-16).

అధికారికంగా, ఒకడు దేవుని నామమును ఉచ్చరిస్తే తప్ప, వాడు దేవదూషణ చేసాడని నేరము మోపుటకు వీలులేకుండినది;[20] కాబట్టి, మెస్సీయయై యున్నాడని సాధికారంతో చెప్పుకొనుట (యేసు గాక, మరెవరైనా గాని అబద్ధముగా చెప్పుకొనినప్పటికిని), మరణ శిక్ష విధింపబడవలసిన నేరము కాదు. ఏది ఏమైనా, "మాకొక నియమము కలదు, తాను దేవుని కుమారుడనని చెప్పుకొనెను గనుక ఆ నియమము చొప్పున ఇతడు చావవలెనని" యూదులు అటుతరువాత చెప్పారు (యోహాను 19:7).

**వచనములు 67, 68.** యేసు అన్న యెదుట ఉన్నప్పుడు, ఆయన ఈ ప్రధాన యాజకునికి ఎదురు ప్రశ్న వేయుటకు వెనుకాడలేదు కాబట్టి అధికారులలో ఒకడు ఆయనను అరచేతులతో కొట్టాడు (యోహాను 18:21, 22). యేసు కయప యెదుటికి కొనిపోబడగానే, ఆయన యెడల అక్రమమైన అభిచర్యలు చేపట్టుట మరియు ఆయనను హింసించుట పునఃప్రారంభమయ్యింది.

వారు చేపట్టిన చర్యల ద్వారా, సన్హెడ్రిన్ మహా సభ యేసును మరియు ఆయన స్వాధికారంతో చెప్పిన సత్యములను తోసిపుచ్చినది. కొందరు **ఆయన ముఖము మీద ఉమ్మివేసారు**, ఇది ఒక యూదుని యెడల చేయబడగల అతి గొప్ప అవమానకరమైన చర్యయై యున్నది. వారు **ఆయనను వారి పిడికిళ్లతో గుద్దిరి; ఇతరులు వారి అరచేతులతో ఆయన చెంప మీద కొట్టిరి**. వీరు "అధికారులని" మార్కు 14:65 చెప్పుచున్నది.

వారు ఆయనను చెంప మీద కొట్టుచు, **క్రీస్తూ, నిన్ను కొట్టినవాడెవడో ప్రవచింపుమనిరి.** ఈ సమయంలో యేసు కళ్లకు గంతలు కట్టారని మార్కు మరియు లూకా సువార్తీకులు సూచించుచున్నారు (మార్కు 14:65; లూకా 22:64), ఈ వివరము ప్రస్తుతము మనము అధ్యయనము చేయుచున్న సన్నివేశమును సులభముగా అర్థము చేసికొనుటకు సహాయపడుచున్నది. గుడ్డివాడు పలికిన బుకాయింపు మాటలను వక్రీకరించుట ద్వారా యేసు ఒక ప్రవక్తయై యుండెనను అభిప్రాయమును అధికారులు హేళన చేయుచుండిరి. ఆయన నిజముగా ఒక ప్రవక్తయైనట్లయితే, ఆయనను కొట్టినదెవరో ఆయన గుర్తించగలడు,

మరియు కొట్టిన వానిని చూడకుండానే వాని పేరును కూడ చెప్పగలడు.

## పేతురు బొంకుట (26:69-75)

**[69]పేతురు వెలుపటిముంగిట కూర్చుండియుండగా ఒక చిన్నది అతనియొద్దకు వచ్చి-నీవును గలిలయుడగు యేసుతోకూడ ఉంటివి గదా అనెను. [70]అందుకతడు-నేనుండలేదు; నీవు చెప్పుసంగతి నాకు తెలియదని అందరి యెదుట అనెను. [71]అతడు నడవలోనికి వెళ్లిన తరువాత మరియొక చిన్నది అతనిని చూచి-వీడును నజరేయుడగు యేసుతోకూడ ఉండెనని అక్కడి వారితో చెప్పగా [72]అతడు ఒట్టుపెట్టుకొని-నేనుండలేదు; ఆ మనుష్యుని నేనెరుగనని మరల చెప్పెను. [73]కొంతసేపైన తరువాత అక్కడ నిలిచియున్నవారు పేతురునొద్దకు వచ్చి-నిజమే, నీవును వారిలో ఒకడవే; నీ పలుకు నిన్ను గూర్చి సాక్ష్యమిచ్చుచున్నదని అతనితో చెప్పిరి. [74]అందుకు అతడు- ఆ మనుష్యుని నేనెరుగనని చెప్పి శపించుకొనుటకును ఒట్టుపెట్టుకొనుటకును మొదలు పెట్టెను. వెంటనే కోడి కూసెను. [75]కనుక-కోడి కూయక మునుపు నీవు నన్నెరుగనని ముమ్మారు చెప్పెదవని యేసు తనతో అనిన మాట పేతురు జ్ఞాపకము తెచ్చుకొని వెలుపలికి పోయి సంతాపపడి యేడ్చెను.**

68వ వచనములో వ్రాయబడినట్లు ప్రవచించుటకు యేసుకు గల సామర్థ్యము తృణీకరింపబడి మరియు ఎగతాళిచేయబడిన సన్నివేశము తరువాత, యేసు పలికిన ప్రవచనము నెరవేరిన మరొక సన్నివేశమును మత్తయి మనకు తెలియజెప్పుచున్నాడు.[21] యేసు విషయమై శిష్యులందరు అభ్యంతరపడినను తాను మాత్రం ఏమాత్రం అభ్యంతరపడడని, పేతురు చెప్పాడు (26:33, 35). ఏది ఏమైనా, కోడి కూయక మునుపే, అతడు ఆయనను ఎరుగనని ముమ్మారు బొంకునని యేసుప్రభువు పేతురుతో చెప్పాడు (26:34).[22] పేతురు తన మాట నిలబెట్టుకొనవలెననియే ఉద్దేశించాడు. గెత్సేమనే తోటలో, అతడు యేసు పక్షాన మరణమగునంత వరకు పోరు సలుపుటకు సహితము సంసిద్ధుడయ్యాడు (26:51). యేసు పేతురును అధికారపూర్వకంగా మందలించుట, దానికి తోడుగా యేసు ప్రతిఘటించకపోవుట, పేతురు యొక్క అంతకు మునుపటి నిబద్ధతకు భారీ ఆఘాతము కలిగించియుండవచ్చును (26:52-54).

**వచనము 69. పేతురు వెలుపటి ముంగిట కూర్చుండి యుండి** శత్రువులు రగుల జేసిన మంట యొద్ద చలికాచుకొనుచుండగా (మార్కు 14:54), పేతురు యేసు శిష్యులలో ఒకడని **ఒక** పనిపిల్ల గుర్తుపట్టింది. **నీవును గలిలయుడగు యేసుతో కూడ ఉంటివి గదా** అని ఆ చిన్నది పలికింది. యేసు గలిలయలో పెంచబడి, అదే ప్రాంతంలో తన పరిచర్యను అధికంగా చేసినందు వలన, యెరూషలేము నివాసులలో అనేకులు ఆయనను "గలిలయవాడని" ప్రస్తావించుచుండిరి.

**వచనము 70**. అతడు యేసుతో కూడ **ఉండలేదని** బొంకుచు, పేతురు అందరి యెదుట **నీవు చెప్పుసంగతి నాకు తెలియదని పలికాడు.** బహుశా భయము కలిగినందున కాబోలు, పేతురు ఆ ప్రాంగణమును విడిచి వెలుపలకు వెళ్లిపోయాడు (మార్కు 14:68).[23]

**వచనము 71.** పేతురు ఇంకా ఎక్కువ ప్రత్యేకముగా నున్న చోటు కొరకు వెదకుటకు ప్రయత్నించాడు కానీ అది బెడిసికొట్టింది. **అతడు నడవలోనికి వెళ్లిన తరువాత, మరియొక**

**చిన్నది** పేతురును చూచింది. **వీడును నజరేయుడగు యేసుతో కూడ ఉండెనని** ఆ చిన్నది అందరికి తెలిసేటట్లుగా ప్రకటించింది. ఈ సారి యేసు తన స్వస్థలము పేరుతో గుర్తింపబడుచున్నాడు (2:23 చూడు).

**వచనము 72. మరొక పర్యాయము,** పేతురు యేసును ఎరుగనని **బొంకాడు,** ఈసారైతే **ఒట్టు పెట్టుకొనుచు, ఆ మనుష్యుని నేనెరుగనని** పలికాడు–యేసును పేరు పెట్టి కూడ సంబోధించలేదు–యేసు ఎవరో అతనికి అసలే తెలియదన్నట్లుగా మాటలాడాడు. పేతురు యేసును ఎరుగనని బొంకుట మాత్రమే కాదు, కానీ ఆయన ఎవరో అతనికి అసలే తెలియదన్నట్లు నొక్కివక్కాణించాడు. పేతురు ఏమని ఒట్టుపెట్టుకొన్నాడో మనకు మత్తయి సువార్తీకుడు నిర్దిష్టముగా తెలియజెప్పుట లేదు.

**వచనము 73**. యేసును ఎరుగనని పేతురు ఆ చిన్నదాని నెదుర్కొన్నప్పుడు మొదటిసారి చెప్పినదానికి మరియు ఈసారి చెప్పినదానికి మధ్య ఒక గంట సమయం గడిచిపోయింది (లూకా 22:59). అక్కడ నిలుచుండి జరుగుచుండిన ఈ విషయమంతటిని గమనించుచుండినవారిలో కొందరు **పేతురు** నిజముగా యేసు శిష్యులలో **ఒకడై** యుండెనో లేదో యని నిర్ణయించుకొనుటకు ప్రయత్నించుచుండిరి. పేతురు మాట లాడుచుండిన తీరునుబట్టి అతడు నిశ్చయముగా యేసు శిష్యులలో ఒకడై యుండెనని వారు ఒప్పింపబడిరి. అక్కడ నిలిచియుండినవారు, **నిజమే, నీవును వారిలో ఒకడవే; నీ పలుకు నిన్ను గూర్చి సాక్ష్యమిచ్చుచున్నదని** అతనితో చెప్పారు. పేతురు నోటి మాటలనుబట్టి అతడు గలిలయుడని కూడ వారు చెప్పగలిగిరి (మార్కు 14:70).

పాత నిబంధన కాలములో సహితము, ఇశ్రాయేలు ప్రజలలో వారు నివసించుచుండిన ప్రాంతము ప్రకారము వారి నోటి మాటల ఉచ్ఛారణ తీరులో తేడా ఉండినది (న్యాయాధిపతులు 12:1–6). మొదటి శతాబ్దము కాలములో, ఈ తేడాలు ప్రాథమికంగా యూదయలోను (దక్షిణమున) మరియు గలిలయలోను (ఉత్తరమున) నివసించుచుండిన వారిలో ఉండినవి.

**వచనము 74.** చివరిసారి నిందింపబడుచుండిన దానికి ప్రతిస్పందనగా, **ఆ మనుష్యుని నేనెరుగను** అంటూ పేతురు **శపించుకొనుటకును ఒట్టుపెట్టుకొనుటకును మొదలుపెట్టాడు.** అతడు సత్యము చెప్పనట్లయితే దేవుని శాపము అతనికి తగులునుగాకని పలుకుచుండెను (రూతు 1:17; 1 సమూయేలు 3:17; 14:44; 20:13; 25:22 చూడు). తాను చెప్పుచుండినది నిజమేనని నొక్కివక్కాణించునట్లు అదనంగా ఒట్టుపెట్టుకొనుచుండెను (26:72 చూడు). పేతురు బొంకులను మరియు అతడు పెట్టుకొనిన ఒట్టులను ఒక చోట చేర్చినట్లయితే, అవన్నీ కలిపి అతడు ముమ్మారు బొంకినట్లగును. పేతురు మూడవసారి బొంకినప్పుడు, **వెంటనే కోడి కూసెను**. ఇది సరిగ్గా యేసు ప్రభువు ముందుగా తెలియజెప్పినట్లే జరిగినది (26:34).[24]

**వచనము 75. కోడి** కూసిన తరువాత, "అప్పుడు ప్రభువు తిరిగి పేతురువైపు చూచెను" (లూకా 22:61). అది ఎంత గంభీరమైన చూపైయుండినదో కదా! **కోడి కూయక మునుపు నీవు నన్నెరుగనని ముమ్మారు చెప్పెదవని యేసు తనతో అనిన మాట పేతురు జ్ఞాపకము తెచ్చుకొని** తాను చేసిన తప్పేమిటో గ్రహించాడు. అత్యంత దుఃఖముతో నిండినవాడై, **అతడు వెలుపలికి పోయి సంతాపపడి యేడ్చెను** (2 కొరింథీయులకు 7:10 చూడు).

## తొట్రిల్లి పడిపోయినా, తిరిగి లేచిన పేతురు (26:69–75)

మనలో అనేకులము పేతురుతో పోల్చుకొనబడవచ్చును. అతడు దుడుకుతనముగలవాడు, జిజ్ఞాసగలవాడు, పెంకితనముగలవాడు, మరియు బలహీనుడై యుండెను. అతనంత ఉన్నతముగా ఎదిగినప్పటికిని, మరలా అతనంత పతనమైనవారు మరొకరు లేరు. ప్రభువైన యేసుతో కూడ ఇంత అత్యంత సన్నిహితముగా ఉండినవాడెవడైనాగాని ఆయనను ఎరుగనని ఎలా బొంకగలడు? పేతురును పడగొట్టిన విషయాలు మనము కూడ పతనమగుటకు హేతువులు కాగలవు.

*పేతురు పతనమైన విధానము.* తానెంతటి బలహీనుడో పేతురుకు ఎరుకలేదు (14:22–31; 16:21–23; 26:30–35; యోహాను 18:10, 11). శోధనలో ప్రవేశించకుండునట్లు ప్రార్థన చేయచుండవలసిన సమయంలో అతడు నిద్రించుచుండెను (26:36–46), యేసు కొరకు ప్రార్థన చేయుచుండిన సహోదరుల సహవాసములో ఉండుటకు బదులుగా అతడు ఆయనను దూరము నుండి వెంబడించాడు (26:58), మరియు వారొకరికొకరు చేదోడువాదొడుగా నుండునట్లు యోహాను పక్షము వహించుటకు బదులుగా శత్రువుతో స్నేహ కరము కలిపాడు (లూకా 22:55). అతని అధమాధమ స్థాయి గూర్చి చెప్పుకొంటే, ప్రభువును ఎరుగనని బొంకాడు, ఒట్టుపెట్టుకొన్నాడు మరియు తననుతాను శపించుకొన్నాడు (26:69–75).

*పేతురు తిరిగి లేచిన విధానము.* యేసు యొక్క చూపుతోనే బుద్ధిచెప్పబడిన పేతురు, యేసు పలికిన మాటలను జ్ఞాపకమునకు తెచ్చుకొన్నాడు (లూకా 22:61). పేతురు పశ్చాత్తాపపడ్డాడు (లూకా 22:62) మరియు నిజముగా మారుమనస్సు నొందాడు (యోహాను 21:15–19). అతడు మరణము వరకు ప్రభువు యెడల నమ్మకముగా ఉండినాడు (యోహాను 21:18, 19 చూడు). అతడు రోమా పట్టణములో సిలువవేయబడుట ద్వారా మరణించాడని ఒక బలమైన సాంప్రదాయము చెప్పుచున్నది.[25] అతడు యేసు ప్రభువు సిలువవేయబడినట్లే మరణించుటకు తగినవాడని తననుతాను ఎంచుకొనలేదు గనుక తలక్రిందులుగా సిలువవేయబడవలెనని కోరినట్లు చెప్పుకొనబడుచున్నది.[26]

బలమైన క్రైస్తవుడు కూడ తొట్రిల్ల పడవచ్చు, అయితే మనం పడిపోవల్సిన అవసరం లేదు. తరువాత, సంఘములోని నాయకుడుగ క్రైస్తవుల ఎదుగుదలకు సహకరించు మరియు తొట్రుపాటును తొలగించు మార్గదర్శక సూచనలను పేతురు వ్రాసాడు (2 పేతురు 1:5–11)

---

సూచనలు

[1]రోమా సైనికులు యేసును యూదుల అధికారుల యెదుటికి తీసికొని వచ్చారను వాస్తవము మనలను ఆశ్చర్యచకితులను గావింపనవసరము లేదు. వారతనిని ప్రశ్నించునట్లు, రోమా సేనాధిపతి క్లౌదియ లిసియా చేత యూదుల మహా సభయైన సన్హెడ్రిన్ సభకు అప్పగింపబడినవాడు, పౌలు విషయములో ఇటువంటి సమానాంతరమును మనము చూడగలము (అపొస్తలుల కార్యములు 22:30). [2]కయప, అన్న కాదు, యేసుకు విరోధముగా రోమా గవర్నరు పిలాతు యెదుట నేరము మోపుటకు అధికారము కలిగియుండెను. [3]Mishnah *Sanhedrin* 1.1, 4, 5. [4]Ibid., 1.6. [5]Ibid., 4.3. [6]Ibid., 4.1. [7]Ibid.,

11.2; *Middoth* 5.4. ఏది ఏమైనా, ఈ సారి సమావేశమునకు ముందు సన్హెడ్రిన్ మహా సభ సమావేశము కావలసియుండిన చోటు ఆలయ కొండకు వెలుపల నుండిన మరొక చోటికి మార్చబడి యుండవచ్చును. అదనపు సమాచారము కొరకు Bruce Corley, "Trial of Jesus," in *Dictionary of Jesus and the Gospels*, ed. Joel B. Green and Scot McKnight (Downers Grove, Ill.: Varsity Press, 1992), 851 చూడు. [8]Mishnah *Sanhedrin* 4.1. [9]Ibid., 3.6; 5.3, 4. [10]Ibid., 4.1.

[11]ఈ వచనములో, autē అను గ్రీకు పదము రాజభవనమునే కాదు కానీ "ముంగిటిప్రాంగణమును" సూచించుచున్నది (26:3పై గల వ్యాఖ్యానము చూడు). [12]Talmud *Abodah Zarah* 8b *చూడు.* [13]Leon Morris, *The Gospel according to Matthew,* Pillar Commentary (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1992), 681. [14]Ibid., 683. [15]Mishnah *Shebuoth* 4.3 చూడు. [16]సన్హెడ్రిన్ సభ మొత్తము సమావేశమైనప్పుడు ఉదయకాలము తీర్చబడిన తీర్పు సందర్భములో యేసు పలికిన ఈ మాటలను లూకా గ్రంథస్థంచేసాడు (లూకా 22:66–71). బహుశా ఈ మాటలు యేసుకు రాత్రివేళ తీర్చబడిన తీర్పు నుండి పునరుక్తము గావింపబడి యుండవచ్చును. ఉదయకాలము మరొక పర్యాయము సమావేశమగుట ద్వారా, వారు చట్టమునకు విరుద్ధముగా రాత్రి వేళ తీర్పులోని నిర్ణయములు అధికారయుతమైనవిగా అగుపించునట్లు చేయుటకు యూదుల నాయకులు ప్రయత్నించుచుండిరని స్పష్టమగుచున్నది. [17]Donald A. Hagner, *Matthew 14-28*, Word Biblical Commentary, vol. 33B (Dallas: Word Books, 1995), 801. [18]Jack P. Lewis, *The Gospel According to Matthew,* Part 2, The Living Word Commentary (Austin, Tex.: Sweet Publishing Co., 1976), 153. [19]Mishnah *Sanhedrin* 7.5. [20]Ibid.

[21]Morris, 687. [22]కోడి "రెండు మారులు" కూయక మునపు పేతురు యేసును ఎరుగనని ముమ్మారు బొంకునని మార్కు 14:30 సెలవిచ్చుచున్నది. [23]మార్కు 14:68లో, "అప్పుడు కోడి కూసెను" అని కొన్ని గ్రీకు చేతి రాత ప్రతులలో వ్రాయబడి యున్నది–అనగా, అది మొదటిసారి. (Bruce M. Metzger, *A Textual Commentary on the Greek New Testament,* 2d ed. [Stuttgart: German Bible Society, 1994], 97.) [24]మరొక పర్యాయము, కోడి "రెండు మారులు" కూసినదని మార్కు నివేదించుచున్నాడు (మార్కు 14:72). [25]Eusebius *Ecclesiastical History* 2.25. [26]Alexander Walker, trans., "The Acts of Peter and Paul," in *Ante-Nicene Fathers*, ed. Alexander Roberts and James Donaldson, rev. A. Cleveland Coxe (n.p.: Christian Literature Publishing Co., 1886; reprint, Peabody, Mass.: Hendrickson Publishers, 1994), 8:484.